# సంపద తెచ్చిన సంతాపం

## ఆర్. వి. జి. కృష్ణమూర్తి

రామానందం యింట్లో కాలెడుతూండగానే రెండు జాబులు కనిపించాయి టేబిల్ మీద. ఒకటి పజిల్స్ కంపెనీ కవరు. ఫస్ట్ ప్రైజయితే టెలిగ్రామే వచ్చివుణ్ణు! ముందు ఆ కవరే చించాడు.

"నాలుగు తప్పుల్లోవున్నారు. యీ దఫా ప్రయత్నించండి. విజయముమీదే కావచ్చు. పజిల్ కూపన్లుకూడా యిందులో పంపుచున్నాము" అని వ్రాసివుంది.

కంపెనీవాళ్ళమీద లోపల ఎంతో కోపవున్నా బయటికి సంతోషంగా వున్నట్టే నటించాడు. ఇంట్లో అందరూ తన యీ ఒక్క పనిని వేలెత్తి చూపేవారే. యింట్లో ఏవస్తువు లేకున్నా "వెధవపజిల్సు. డబ్బంతా వీటికే సరిపోయె"అనే వాళ్ళు. పెద్దన్నయ్య నెలకు రెండువందలాయాభై, తాను ఓవందాయాభై తెస్తున్నారాయె. పైగా నాన్న పెన్షనో వందా పాతిక వస్తుంది ఇంట్లో అన్ని ఖర్చుల్లోనూ తన పజిల్సే పెద్ద ఖర్చు వీళ్ళకి. తనలో ఏదైనా లోపం చూపాల్సి వస్తే అమ్మగాని, నాన్నగాని యీ పజిల్సుతోనే మొదలెడ్తారు.

ఇక భార్య—రూపవతి - పరమ శత్రువు (యీ విషయంలో మాత్రమే) — "యీ పజిల్సుకు పెట్టేడబ్బుతో ఒక నెక్లెస్ వచ్చివుండును" అనేది.

రామానందానికి యింట్లో అందరిమీదా ఎంతో కసిగా వుంది. "వెధవది...ఒక్కసారైనా ఏదో కొంత డబ్బొంటూవస్తే వీళ్ళ నోళ్లు కట్టేద్దును" అనుకుంటూ డప్పుడప్పుడూ. కాని ఒక్కసారైనా వచ్చిన పాపానపోలేదు. తన పేరుతో కడితే రావడంలేదని భార్య పేరుతో కట్టాడు. అమ్మ, నాన్న, అన్నయ్య-అందరి పేర్లతోను కట్టి చూచాడు. ఊహూ! లాభంలేకపోయింది.

ఇక రెండోజాబు. నెల్లూర్లోవుండే తన చెల్లెలు అనూరాధ దగ్గర్నుంచి క్షేమ సమాచారాలు...విశేషాలేమీ లేవు...పాపం - పిచ్చిపిల్ల...రామానందం అంటే ఎంతో ప్రేమ. అమ్మకుగాని, నాన్నకుగాని, పెద్దన్నయ్యకుగాని ఎవ్వరికీ వ్రాయదు జాబులు; ఒక్క రామానందానికి తప్ప. "దాని బ్రతుకూ ఏమంత బాగులేదు. బావ గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా. వచ్చే జీతం విలాసాలకు చాలకపోయినా భుక్తికిబాగానే గడుస్తుంది. బావకు పిచ్చికోపం. అహంభావం-అహంకారం. ఆడదంటే అలుసు - అనూరాధంటే యీర్ష్య-ఎందుకో! అతన్ని అత్తగారింట్లో అందరూ ఎంతో మర్యాద చేస్తారు అతని గుణం తెలుసుకొబట్టి వేళాకోళాలైనా ఎక్కువగా చేయరు. ఇంత యిదిగా వున్నా అతనెందుకో చాలా కష్టపడతాడు. భార్యనూ, అందర్నీ కష్టపెడుతున్నాడు.

ఈసారి ఏమైనాగాని, అనూరాధ పేరుతో పజిలు కట్టాలనుకున్నాడు. తక్షణమే కట్టాడు. ఆ మరుక్షణమే జాబు అనూరాధకు వ్రాయనూ వ్రాశాడు.

"అమ్మాయ్. నాకు అదృష్టం లేదని తేలిపోయింది. నాకే గాదు. ఈ యింట్లో ఎవ్వరికీ లేదు. వీళ్ళ ఎవ్వరి హృదయాలూ మంచివిగావు. నేను పజిల్సు కడుతున్నానని తిడతారు. ఒక్క పెద్దన్నయ్యమాత్రం ఏమీ అనడుగాని "ఎందుకురా యీ దండుగ ఖర్చు" అన్నట్టుగా చూస్తాడు. ఇక నా భార్య-అంటే నీ వదిన-ఎప్పుడూ నెక్లేసో పట్టుచీరో అని గోల— నేను చేసే పనులకు సంతోషించేదానివి నీ వొక్కదానివే అమ్మాయ్.

అందుకనే, యీసారి పజిలు నీ పేరుతోనే కడుతున్నా. ఫస్ట్‌ప్రైజ్ లక్షా యాభైవేలు. వస్తే....అది నీ అదృష్టమే. నాకు సగభాగం యిస్తావుకదూ అమ్మాయ్"

మీ అన్న
రామానందం.

అన్నయ్యా,

ఒక కడుపున పుట్టిన వాళ్లం. మీ కెవ్వరికీ లేని అదృష్టం నాకు మాత్రం పట్టబోతుందా? అదే వుంటే నా బ్రతుకీ విధంగా వుండేదా?

సరే! ప్రైజంటూ వస్తే సగభాగం ఏమిటే? డబ్బంతా నీదేకదూ. తప్పకుండా యిస్తాను.

నీ చెల్లెలు
అనూరాధ.

* * *

రోజులు దొర్లుతున్నాయి ఒకనెల గడిచింది. ఎనిమిది కొట్టందే పడకమీదనుంచి లేవని రామానందం ఆ రోజు ఆరింటికే లేవడంతో వాళ్లూ వీళ్లూ ఆశ్చర్యపోయారు. త్వరగా ముఖం కడిగి, కాఫీత్రాగి పరుగెత్తాడు పేపరుకోసం. ఖర్మ...ఆఖరుకు స్టేషన్లో గూడా దొరకలేదు ఆనాటి పేపరు. వెతికి వెతికి, బస్ స్టాండు చేరగానే ఓ కుర్రాడివద్ద దొరికింది. వాడికి రూపాయి నోటిచ్చి, చిల్లరైనా తీసుకోకుండా అరుస్తూ పరుగెత్తాడు యింటివైపు.

పావుగంట తర్వాత హాల్లో జరిగిన యీ అవసర సమావేశం ముగియగానే రామానందంతల్లి కొడుక్కి దిష్టితీసి వేసింది.

మర్నాడు పత్రికల్లో అనూరాధ రామ్మూర్తితో సహా ఫోటో కనిపించింది.

"మీరీ డబ్బుతో ఏమి చేయదలచుకున్నారు?"

"ఏదైనా వ్యాపారంచేసి స్వతంత్రంగా జీవించదలచుకున్నాం."

"ధర్మకార్యాలకు ఏదైనా వినియోగిస్తారా?"

"ఏదో కొద్దిగా."

ఇలా జరిగిందట అనూరాధతో పజిల్ కంపెనీవాళ్ల యింటర్వ్యూ.

* * *

కలకత్తా మెయిల్లో మూడవ తరగతి పెట్టెలో ఒక మూల రామానందం కూర్చుని కిటికీలోగుండా వెలుపలికి చూస్తున్నాడు. బండి గూడూరు స్టేషను దాటింది. ఇంకెంత? నెల్లూరు ఇరవైనాలుగు మైళ్ళు. గ్రాండు ట్రంకురోడ్డుమీద ఒక కారు రివ్వున వచ్చేస్తోంది. "నీవు ముందా - నేను ముందా" అన్నట్టు మెయిల్ కంటే వేగంగా వెళ్తోంది. కాని ఏం లాభం. లెవెల్ క్రాసింగ్ వద్ద కారు ఆగిపోక తప్పలేదు. అప్పటికి మెయిల్దే గెలుపు చిన్నగా నవ్వాడు రామానందం. నెల్లూరుకు చేరేందుకు నిమిషాలు లెక్కపెట్టడం మొదలెట్టాడు.

హడావుడిగా తలుపుకొట్టి, లోపలదూరి, "కంగ్రాచ్యులేషన్స్ అనూరాధా. దీన్తో మన దరిద్రం పారిపోయింది." అన్నాడు. రామమూర్తి ఏమీ మాట్లాడకుండానే

# ★ సంపదతెచ్చిన సంతాపం ★

ప్రక్కకు తిరిగి పడుకున్నాడు అనూరాధ మాత్రం నవ్వింది.

"అమ్మాయ్ అయితే వాళ్ళ డబ్బుయిచ్చేశారా?"

"చెక్కు యిచ్చారు. అంత డబ్బూ మనింట్లో ఎందుకులే అని, బ్యాంకులోనే వుండనిచ్చాం స్నేహితులూ వాళ్ళూ టీ పార్టీలూ అవీ అంటే ఓ వంద ఖర్చయినయ్" అన్నది.

మర్నాడు మధ్యాహ్నం బయల్దేరే దాకా మరల డబ్బు ప్రసక్తి ఎత్తలేదు అనూరాధ అంది "డబ్బుతీసుకు పోతున్నావా?" రామమూర్తి ఏమీ పలక్కుండా ఏదో ఆలోచిస్తున్నాడు

"ఎందుకులే అమ్మాయ్. నా అంగైదు రోజుల్లో మళ్ళీ వచ్చి నిన్నూ డబ్బునూ కూడా తీసుకెళ్తాను." రామమూర్తి వైపు తిరిగి "అప్పుడు నీవూ మా వూరికి రావాలి బావా" అన్నాడు

"చూస్తాంలే అప్పుడు" అని జవాబిచ్చాడు రామమూర్తి వెళ్ళేప్పుడు "వస్తాను బావా" అంటే "ఊ" అని మాత్రం అన్నాడు. అనూరాధ వీధి గుమ్మంవరకూ సాగనంపింది

శ్రావణ మాసం నోములకు అనూరాధను పిల్చుకెళ్ళేందుకు తల్లితో సహా రామానందం వచ్చాడు తల్లి కూతుర్ని చూచి మురిసి పోయింది. తనింట్లో ఎవ్వరికీ లేదు గదా యింత అదృష్టం! అనూరాధను పెళ్ళిచేసుకున్నందువల్లనే ఇంటర్మీడియట్ తో యుద్ధంచేసిన రామమూర్తి బి. ఏ. మొదటి దఫా ప్యాసయ్యాడు. నిరుద్యోగిగా ఆర్నెల్లయినా గడవకుండానే గవర్నమెంటులో గుమాస్తాగిరి సంపాయించాడు. ఇలా లెక్క వేసుకుంటూ పోతే ఆ కుటుంబానికి జరిగిన మేళ్ళన్నీ కూడా అనూరాధ రామమూర్తిని పెళ్లిచేసుకున్నందువల్లనే ఆ విషయాన్ని అందరూ గ్రహించింది కూడా అనూరాధకు లక్షాయాభై వేలు వచ్చిన తర్వాతనే. యీనాటికి దేవుడు దయతలచాడు — అని తల్లి ఆనందంతో వచ్చి ఉబ్బి తబ్బిబ్బవుతూంది "ఇంత సంతోషపడుతున్నాను ఏమీ ఆపద రాదుగదా తర్వాత" అని కొత్త దిగులొకటి పట్టుకుంది కూడానూ.

ఆ రోజు ఆదివారం. ఎండ తీవ్రంగా వుంది. మధ్యాహ్నం అందరూ భోజనాలు ముగించుకుని తాంబూలాలు వేసుకుంటున్నారు. అంతా కులాసాగా మాట్లాడుతుంటే రామమూర్తి మాత్రం చాలా మితంగా మాట్లాడుతూ, ఏదో ఆలోచిస్తున్నట్టు వుంటున్నాడు. అనూరాధ వట్టి వేళ్ళ విసనకర్ర మీద చన్నీళ్లు చల్లి భర్తకు దగ్గరగా కూర్చుని విసురుతూంటే, రామానందం ఆలోచనల్లో వున్న తన భార్య మీదికి పోయింది తన భార్య ఒక్కనాడైనా యిలా విసరలేదా ఎప్పుడైనా దగ్గర కూర్చుని కులాసా కబుర్లు చెబుతుండదు కుంటే, నగలూ, చీరలూ, డబ్బూ — తప్పితే వేరేవిషయమే మాట్లాడదు గా — ఛీ. ఛీ.

"ఏమిటన్నయ్యా ఆలోచిస్తున్నావు". రామానందం ఆలోచనలకు భంగంకలిగింది

"ఏమీ లేదమ్మాయ్ కాస్తపడుకోవాలి" తానాలోచిస్తున్న విషయం చెప్పటం కంటే తనపరువుకే భంగంకదూ మరి

*　　*　　*

నాలుగు గంటలకు బావమరుదు లిద్దరూ షికారుకు బయల్దేరారు. రామమూర్తి "సినిమాకు గాని, లేక అలా టౌంకుర్రోడ్డుకు గాని వెళ్దాం" అన్నాడు. రామానందం "పార్కుకు గాని, అలా పెన్నవొడ్డుకు గాని వెళ్దాం" అన్నాడు రామమూర్తికి బజార్లో వాటినీ వీటినీ చూస్తూ తిరగడమంటే సరదా రామానందానికి చల్లటి గాలీ, ప్రశాంత వాతావరణము అంటే ఇష్టం ఆరోజు రామానందమే జయించాడు పెన్నానది వద్దకు నడిచారు.

అప్పటికి నదిలో నీళ్లు లేవు క్రొత్తగా కట్టిన బ్రిడ్జిమీద కొంతదూరం నడిచివెళ్లారు. మరల తిరిగివచ్చి ఇసుకలో కూర్చున్నారు చల్లటి గాలి శరీరాలకి ఎంతో హాయినిస్తోంది జనం చాలా తక్కువగా వున్నారు. సమీపంలో నలుగురు పిల్లలు ఇసుకతో ఇళ్ళుగట్టి ఆడుకొంటూ నెత్తినా ముఖాన ఇసుక పోసుకుంటూంటే వాళ్ళ తల్లి దండిస్తూంది ఈ దండనలు వాళ్లు లెక్క చేయలేదు తిరుగుతుంటూ పిల్లలు పరుగిడుతున్నారు. రైలుబ్రిడ్జి పైన కూత వినబడుతోంది ప్రయాణీకులు కిటికీలోంచి క్రిందికి తొంగిచూస్తున్నారు. పిల్లలుతిరుగుతుంటున్నారు వాళ్ళకక్కయ్య కాబోలు పరుగెత్తుకెళ్ళి లాక్కొచ్చింది.

రామానందం సిగరెట్ పీలుస్తూ ఇవన్నీ చూచి ఆనందిస్తూంటే రామమూర్తి అగ్గిపుల్లతో ఇసుకమీద పిచ్చిగీతలుగీస్తున్నాడు.

చీకటి బడుతూంది. ఇద్దరూ యింటికి బయల్దేరారు. "ఏం బావా! రేపు అమ్మాయిని తీసుకెళ్తాం" అన్నాడు రామానందం

ఏమీ తడుముకోకుండానే రామమూర్తి "అలాగే" అన్నాడు.

"మరి నీవో?"

"వీలుండదోయ్."

"సరే! డబ్బు రేపు బ్యాంకినుంచి తీసుకురావద్దూ" అని అడిగాడు రామానందం, రామమూర్తిని పైనుంచి క్రిందిదాకా చూస్తూ.

రామమూర్తి జేబులోంచి సిగరెట్ పెట్టె బైటికి దీసి "అగ్గిపెట్టె కొంచెం యిలా యియ్యి" అన్నాడు

"సరేగాని" యింకా ఏదో చెప్పబోయాడు రామానందం అగ్గిపెట్టె అందిస్తూ.

లాల్చీలోపలికి ఏదో పురుగు దూరిందని దాన్ని బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్నాడు రామమూర్తి జవాబీయకుండానే పురుగు దీయబోవడం, లాల్చీ సర్దడంతో నెమ్మదిగా రంగనాయకస్వామి దేవాలయం వద్దకు వచ్చారు

"అలా గుడిలోకి వెళ్ళివస్తాం పద" అంటూ లోపలికి దారితీశాడు రామమూర్తి. రామానందానికి అతన్ననుసరించక తప్పలేదు

ట్రంకురోడ్డులోకి వచ్చేంతవరకూ ఎవరూ ఏమీ మాట్లాడలేదు ఈ మూభావమేమిటో రామానందానికేమీ అర్థం గాకుండా వుంది ఏదో మాట్లాడుదామని నోరు తెరిచేలోగా "టెయిలర్ వద్ద బటలు కుట్టేందుకిచ్చాను తెస్తానుండు" అని మెడవెక్కాడు రామమూర్తి.

"అతను ఎందుకిలా తప్పించుకొంటున్నాడు! ఎప్పుడు డబ్బువిషయం ఎత్తినా ఏదో విరసంగా వినవట్లుంటున్నాడు. తనకేదైనా కావాలంటే కావంటానా తన చెల్లెల్ని చూసైనా యివ్వద్దూ అసలు అనూరాధకు సగం యిస్తానంటేనిగా. తప్పకుండా దానిభాగం యిక్కడే యిచ్చివెళ్తాను" అనుకుంటూండగా రామమూర్తి చేతిలో పొట్లంతో మెడదిగొచ్చాడు

కాస్త కాఫీతాగి వెళ్దామంటూ హోటల్ వైపు నడిచాడు. రామానందం ఏదో అడగబోతున్నాడు ఆ సంగతి రామమూర్తి గ్రహించాడు. చటుక్కున "కొంచెం డికాక్షన్ స్ట్రాంగ్" అని సర్వరుని అజ్ఞాపించి నిబ్బరంగా రామానందం వైపు తిరిగాడు. రామానందం ముఖంలో నిన్న మొన్నటి కళాకాంతుల్లో విసమెత్తయినా ఆ సమయంలో అగుపించటం లేదు — "ఇదేదో తేల్చేసుకోవాలి యీ ముసుగులో గుద్దులాట ఎంతసేపూ" అని యిద్దరి మనస్సుల్లోనూ వుంది

"ఏమిటి రామానందం ఏదో అడుగుతున్నావు" అన్నాడు సాగదీస్తూ


శ్రీ వత్స వారి

వైటో డెంట్

పంటిక్రిములను సంహరించే పండ్లపొడి

రామ్మూర్తి ముఖంమీద తెచ్చిపెట్టుకున్న చిరునవ్వు కనబడుతూంది

"ఆ! ఏంలేదు. రేపు బాంకీనుంచి డబ్బు తీర్దామని" అన్నాడు రామానందం ఎదుట గోడమీదవుండే ప్రొప్రైటర్ ఫోటో చూస్తూ

"ఎందుకూ?" రామ్మూర్తి బిల్లు నందుకున్నాడు

"అందుకే?" రామానందం కొయ్యబారి పోయాడు బావగారిధోరణి ఏమీ అర్థం కాలేదు

బిల్లు చెల్లించి బయటపడ్డారు

సిగరెట్టు ముట్టించి బయల్దేరారు

"ఏమిటోయ్ రామానందం ఏదైనా అప్పుగా కావాలంటే ఎంతకావాలో చెప్పు" అడిగాడు రామ్మూర్తి అప్పుడే చాలామంది అప్పులు అడుగుతున్నారని, వాళ్ళకందరికీ ఏకాభిప్రాయంగా సర్దిచెప్పాననీ, దాంతో కొందరు కోప్పడి తనతో మాట్లాడ్డమే మానుకున్నారనీ, త్వరలో ఏదైనా వ్యాపారం మొదలెట్టాలనీ .. ఏమేమో చెప్పేశాడు రామ్మూర్తి

పిడుగు సరీగ్గా తన నెత్తిన బడ్డటయింది రామానందానికి. కొంతవరకూ విన్నాడు. కొంత వినిపించనేలేదు బుర్ర వేడెక్కిపోయింది. "బావ చెల్లెలుభర్త, తనను మోసం చేయ తలపెట్టాడు. యీ వుద్దేశ్యం అనూరాధకు కూడా వుందా? అదికూడా తేల్చేసుకోవాలి" ఇల్లు సమీపించారు.

భోజనాలవద్ద యిద్దరూ చాలా 'సీరియస్'గా వున్నారు. అనూరాధ కిదేమీ అర్థం కాలేదు రామానందం నంజుతున్నాడు కలిపిన కూరనే మరలా కలిపాడు "కూర బాగుంది కాబోలు" అని అనూరాధ మరి కొంత వడ్డించింది కలిపిన అన్నంతోసహా పక్కకి నెట్టాడు మంచినీళ్లు అన్నంలోపోసి కలిపి, తర్వాత అవి మజ్జిగకాదు మంచినీళ్ళని తెలిసికొని నొచ్చుకున్నాడు అనూరాధ రెప్పవాల్చకుండా చూస్తూంది

ఇక రామ్మూర్తి ఏమీ కలపకుండానే వట్టి అన్నం మాత్రమే తిన్నాడు కొంతవరకూ. తర్వాత మజ్జిగ పొయ్యమన్నాడు. "ఇదేమిటి" అన్నది అనూరాధ

అదంతా నీ కెందుకు పొయ్యమన్నాను పొయ్యిఅన్నాడు చిన్నబుచ్చుకుంది "ఈ మనిషి ఎన్నాళ్ళకూ నన్నర్థంచేసుకోలేడు" రామ్మూర్తి లేచి చెయ్యి కడుక్కున్నాడు. రామానందం ఖాళీకంచం మీద తన పేరు వ్రాస్తూ, తుడుపుతూ వున్నాడు యీ యిద్దరి వైఖరి అనూరాధను దహించేస్తూంది

* * *

"అమ్మాయ్ డబ్బు విషయంలో నీ అభిప్రాయ మేమిటి?"

"ఏమి టన్నయ్యా అభిప్రాయా అ కింగులో ఏముంది రేపే బ్యాంకీలో డబ్బు తీసుకో" అన్నది అమాయకంగా.

"అదేమిటే మరి అత నేమో "అంటూ అంతా చెప్పాడు రామానందం.

అనూరాధ కంపించిపోయింది. ఏమీ అర్థం కావడం లేదు

తన భర్త యింత మోసగాడా-త్వరగా లేచి రామ్మూర్తివద్ద కెళ్లింది.

"ఏమండీ"

.... . ...

"ఇదేమిటండీ?"

"నా యిష్టం"

భయపడింది అనూరాధ.

"మరి డబ్బు "

"ఛీ ఫో నా యిష్టం. నీకు నేను గావాలి అనుకుంటే డబ్బుమాట ఎత్తకు నీ అన్నయ్యే కావాలనుకుంటే నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి అంతే" వీధిలో కెళ్ళాడు విసురుగా

గుప్ప నీళ్ళతో వెనుకకు తిరిగింది అనూరాధ

అంతా విన్నానమ్మా నీవేం చేస్తావు. అనవసరంగా పేచీపడకు అసలే ఒక రకం మనిషి "

"ఇంత మోసమా అన్నయ్యా."

"ఛ్ పండంటి కాపురం పాడుచేసుకోకు. నేను మాత్రం ఏం కష్టపడ్డానా ఏమిటీ యీ డబ్బుకోసం! మీ రిద్దరూ బాగుంటే అంతే చాలమ్మా యింకీ విషయం అతనితో ఎత్తకు వస్తా అనూ జాగ్రత్త. ఉద్రేకాలతో ఒక్క క్షణంలో చేసే పనులే జీవితాల మీద దాడిచేస్తాయ్ మనుష్యుల స్వభావాలనుబట్టి నడుచుకుంటూండాలి వెళ్తానమ్మా" అంటూ బయల్దేరాడు తల్లితోసహా శ్రావణమాసం విషయం ఎవరూ ఏమీ మాట్లాడనేలేదు.

"అన్నయ్యా"...గోడకు చేరబడింది అనూరాధ

* * *

మనస్థిమితం లేక శెలవు పొడిగించాడు రామానందం పనీబాటా లేకుండావుంటే మరీ ఆలోచన లెక్కువౌతున్నాయని శెలవు రద్దుచేసుకుని ఆఫీసు కెళ్తున్నాడు కాని పనిసరిగ్గా చేయలేకపోతున్నాడు. దేని మీదా మనస్సు పోవడంలేదు. ఇంట్లో ఎవరితోనూ మాట్లాడడం మానేశాడు. వేళ కేదో తినడం, ఒంటరిగా తిరగడం. మళ్ళీ పజిల్సుకట్టాలనే లేదు. పూర్తిగా మానేశాడనే చెప్పాలి. అసలు వాటికోసమై ఆలోచించేంత మనస్థిమితం లేదు. స్నేహితుల కందరికీ దూరంగా ఉంటున్నాడు. వాళ్ళతో కలిస్తే గతమంతా తవ్వుతారు. మానే గాయాన్ని రేపినట్టవుతుంది. అందుకనే వాళ్ళకి దూరంగా ఉంటున్నాడు.

సాయంత్రం అయిదు గంటలకి పార్కు కెళ్ళాడు. ఎన్నాళ్ళో అయింది దాన్లో అడుగుపెట్టి

'రామానందం' అని పిలుపు వినబడింది. అప్రయత్నంగా తిరిగి చూచాడు స్నేహితుల మురాతో కలియడం ఆనాటికి తప్పనిసరైంది.

"మరికనుపించటమే లేదేంరా?"

............ ...

"ఆ, మరిచాను. నీ డబ్బువిషయం ఏం తేల్లేదురా?"

"లేదు. ఇక రాదు."

"మంచి బావేరా. హైలాక్ లాగున్నాడు!"

......

"అయితే మీ బావమీద ఓ కేస్ ఫైల్ చెయ్యలేక పోయావ్"

"ఎందుకు రా?"

"ఎందుకేమిటి డబ్బుకోసమైతేనూ"

. . ..

"ఒరేయ్ రామానందం నీ పొట్టి చవటవురా, నేనైతే మీ బావను మూడు చెరువుల నీళ్లు తాగించేవాడిని"

"మీ బావనైతే నేనూ తాగించేవాడిని ఒరేయ్, విష్ణూ నీవు 'లా' పాసై ఇంకా రెండేళ్ళైనా కాలేదు నీకిటువంటి వాటిల్లో అనుభవం చాలా తక్కువ అసలు లేదన్నా నీవు ఒప్పుకు తీరాలి" అని నెమ్మదిగా అన్నాడు రామానందం

"వచ్చినట్టు" అన్నది మరో కంఠం.

"అలాంటివాడికి యిటువంటి కేసు యిస్తే, తీరా అదికాస్తా పోతే ...."

"అది డెఫినిట్ అనుకో" నసిగింది యిందాకటి కంఠమే

"చెడ్డ పేరూ వస్తుంది. మన ప్రతివాది ఎవడో కాదు బావ—చెల్లెలి భర్త"

"అదంతా నాకు వదిలేయరా. అయితే యీ కేసు నేనెందుకు తీసుకుంటాను? పరాంకుశరావు గారితో మాట్లాడి వారిన్నీ తరఫున పని చేయిస్తాను వారికి గెలుస్తుందనే నమ్మకం లేకుంటే ఆకేసే తీసుకోరు" అని వివరించాడు విష్ణు

"సరే నీ యిష్టం. రేపు కనబడతా" అంటూ లేచి వెళ్ళాడు రామానందం

* * *

ఏ వ్యాపారం చేస్తాడూ అని ఆలోచిస్తూ అందరి సలహాలూ సేకరిస్తూ యింకా ఏ నిర్ణయానికీ రాలేక సతమతమౌతున్న రామ్మూర్తి, రామానందం తనమీద కోర్టులో వ్యాజ్యం వేశాడని తెలియగానే అగ్గైపోయాడు. అగ్గైపోయి గర్జించలేదు కాని,

అర్జించేశ్రుంటే భూమ్యాకాశాలు కొంతవరకు దద్దరిల్లి వుండేవి. కాని, ఆ సాయంకాలం అనూరాధకు "యీ బ్రతుకు బ్రతికేకంటే చావడం మేలు" అనిపించింది

రామూర్తి స్నేహితుల సలహాలతో బారిష్టరు కృష్ణారావుగార్ని వకీలుగా కుదుర్చుకున్నాడు. కృష్ణారావుగారు యీ కేసు తప్పకుండా గెలవాలని పట్టుబట్టి ఎన్నో పుస్తకాలు చదివేస్తున్నారు.

రామానందంవైపు బలమైన సాక్ష్యాలేమీ లేవు. తాను అనూరాధ పేరుతోనే షేర్లు కట్టాడు. అంతా అనూరాధ పేరు మీదుగానే జరిగింది. యిందులో దేన్లోనూ తన ప్రసక్తే లేదు కాని పాత ఉత్తరాల కట్టలో ఒక పాతకార్డు, మాసుకొన్న ముచ్చటైన కార్డు, అతి విలువైనది, వెతకగా కనుపించింది మసిబొగ్గుల్లో మాణిక్యం—యీ ఉత్తరాన్ని చూచిన పరాంకుశరావుగారు సంతోషంతో పెద్దకేక వేశారు బంట్రోతుని. తక్షణమే వాడ్ని కాఫీ తెమ్మని నోటీసు జారీచేశాడు. ఇదివారు అతి సంతోషము కల్గినప్పుడు ఆదరించే ఆచారము. ఇలాంటి సన్నివేశము రోజుకు ఒక్కటైనా వుంటుంది.

ఇంత సంతోషానికీ మూలము ఆ పాత కార్డు అదే అనూరాధ వ్రాసినదే. దాన్లోని సగభాగం మీద యీ కేసు జయాపజయాలు ఆధారపడి వున్నాయి.

"సరే. ప్రైజింటూ వస్తే సగం భాగం ఏమిటే డబ్బంతా నీదేకదూ తప్పకుండా యిస్తాను."

నీ చెల్లెలు
అనూరాధ.

యీ భాగమే చాలా ముఖ్యమైంది. కాని రామానందానికిదేమీ సరిపడలేదు. తన చెల్లెలు వ్రాసిన ఉత్తరంమూలాన్నే తనా డబ్బు లాక్కోవాలా. యిక వేరే మార్గం లేదూ-వుండదు ఒక్కసారి ప్లీడరు పరాంకుశరావు వైపు తిరిగాడు సంతోషంతో ఆయన కాఫీ తాగేస్తున్నాడు. యింకేం మాట్లాడలేక పోయాడు

"వాది తన చెల్లెలు పేరుతో షేర్లు కట్టాడు. ఆ షేర్లులో లక్షా యాభై వేల రూపాయలు బహుమానం వచ్చింది. చట్ట ప్రకారం ఆడబ్బు అనూరాధదే కాని అనూరాధ తన అన్నయ్యకు బహుమానంలో సగం డబ్బు యిస్తానని ఉత్తరం వ్రాసింది. దాని ప్రకారం సగం పైకం రామానందానికి చెల్లవలసి వుంటుంది కాని అనూరాధ భర్త ఆ పైకం యిచ్చేందుకు సమ్మతించుట లేదు అసలు ఆ షేర్లు కూడా రామానందం కట్టలేదంటాడు కాని, నిజాన్ని బైటపెట్టేందుకు ఒక్క అనూరాధ వ్రాసిన ఉత్తరంకంటె వేరే సాక్ష్యం అక్కర్లేదు కాబట్టి బహుమానం పైకంలో సగభాగం అనగా డెబ్బై అయిదు వేలు రామానందానికి చెందవలసినది"

యీ విధంగా జడ్జి తీర్పు చెప్పారు

కోర్టు వెలుపల చెట్టుక్రింద రామానందం, అనూరాధ, పెద్దన్నయ్య అందరూ నిలబడి వున్నారు.

రామమూర్తి కోర్టులోనుంచి విసురుగా వెలుపలికి వచ్చాడు.

"యిదిగో చెక్కుబుక్కు. యిక నీకూ, నాకూ సంబంధంలేదు" అని బుక్కును అనూరాధ ముఖంమీద కొట్టివెళ్లాడు అనూరాధ వణకిపోయింది. ముఖం పాలిపోయింది.

రామానందం, అనూరాధ జట్కాలో రామూర్తి వద్ద కెళ్ళారు యింటి యజమాని వచ్చి రామూర్తి యిల్లు ఖాళీచేసి వెళ్ళాడనీ, సామాన్లు అవీ మీరు వస్తే యివ్వమన్నారనీ చెప్పాడు రామూర్తి స్నేహితులందర్నీ అడిగినా, ఏ ఒక్కరూ సరైన సమాధానం చెప్పలేకపోయారు. రామూర్తి పనిజేసే ఆఫీసుకెళ్లి విచారిస్తే ఉద్యోగానికి రాజీనామా నిచ్చి వెళ్లాడని తెలిసింది. చెల్లెలితో యింటి ముఖం పట్టాడు.

*     *     *

అనూరాధ కాపురం యీ విధంగా తయారైందని దిగులు, డబ్బుతో ఏం చెయ్యాలని ఆలోచన ఏమీ తోచకుండా వుంది రామానందంకు అన్నయ్య యిదేమీ పట్టించుకోకుండా ఆఫీసు, తనుగా వుంటున్నాడు

పెద్దల సలహాలపై 'రామానంద్ టెక్స్టైల్స్' అని ఒక పెద్ద బట్టలకొట్టు, 'అనూరాధటాకీస్' అని ఒక సినిమాహాలు యిద్దరు ఘరానా' వాళ్లను పిలిపించి ప్రారంభోత్సవం చేయించాడు కొద్ది రోజుల్లోనే లాభాలు బాగా వచ్చి వ్యాపారం పెద్దది చేశాడు. ఆంధ్రదేశంలోని పెద్ద నగరాల్లో బ్రాంచీలు కూడా పెట్టారు ఇక జిల్లాలో కల్లా పెద్దది, అన్ని వసతులు కలిగిన సినిమాహాలు అనూరాధటాకీస్ ఒక్కటే అయింది. సినిమాస్కోప్ అరేంజిమెంట్లు చేయించాడు. ఆమె పేరుతో ఒక చిత్రానికి కొంత పెట్టుబడి పెట్టాడు. ఆ చిత్రం ఆంధ్రలో శతదినోత్సవాలు జరుపుకున్నది.

హైస్కూలు భవనానికి విరాళము రెండువేలిచ్చాడు వరద బాధితులకూ, భూకంపాల బాధితులకూ, కరువు బాధితులకూ సహాయంచేయని దినమేలేదు కాలేజిలో ఫిజిక్సు లేబొరేటరీని నిర్మించేందుకయ్యే ఖర్చులో నాలుగోవంతు యిస్తానని వాగ్దానం చేశాడు ఆ మరు సంవత్సరమే కాలేజి కమిటీ మెంబరయ్యాడు. డబ్బూ, పలుకుబడీ బాగా సంపాయించాడు. ప్రతి శుక్రవారం పేదలకు అన్నదానం చేస్తాడు. అందువల్ల వాళ్లలోనూ రామానందం పేరు బాగా వినవస్తోంది

ఆంధ్ర మంత్రివర్గం పడిపోయింది. మరల ఎన్నికలకు అభ్యర్థులను నియమిస్తున్నారు. రామానందం పేరు ఆ జాబితాలో కెక్కింది. పెద్ద నాయకుల ప్రోద్బలంవల్ల రామానందం పోటీచేయక తప్పలేదు. ఎక్కువ కష్టపడకుండానే, ప్రత్యర్థికి ధరావతు కూడా దక్కకుండానే గెలిచాడు.

అసెంబ్లీ మొదటి సమావేశానికి ఆంధ్ర రాజధాని కర్నూలుకు వెళ్ళాల్సొచ్చింది. అనూరాధగూడా అన్నయ్యతో బయల్దేరింది కర్నూలుకు

కర్నూలు గవర్నమెంటు హాస్పిటల్‌లో అసిస్టెంట్ సర్జన్‌గావున్న సుబ్బారావు, రామానందం స్నేహితుడు. పనితొందరలో తమ రాకను అతనికి తెలిపేందుకు వ్యవధి లేక పోయింది. స్టేషన్‌నుంచి నేరుగా హాస్పిటల్‌కే వెళ్ళారు. డాక్టర్ సుబ్బారావు అప్పుడే ఒక ఆపరేషన్ పూర్తిజేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. బంట్రోతు ఒక చీటీ నిచ్చి వెళ్ళాడు.

డాక్టర్ సుబ్బారావు ఎదురువెళ్ళి యిద్దర్నీ తీసుకొచ్చాడు.

"ఒక్క ఉత్తరంముక్క వ్రాయలేక పోయావుటోయ్."

"పని తొందర్లో మరచానోయ్"

"అవున్లే! ఎలాగైనా యం యల్ ఏ. విక

(34 వ-పేజీ చూడండి)

ప్రస్ఫుటమైన శబ్దగ్రహణమునకు
ఝంకార్ రేడియో
(బిర్లావారి యాజమాన్యమున తయారైనవి)
కొరండి



సరసమైనధరలో ప్రఖ్యాతిగాంచిన రేడియో
అన్ని స్టేషనులనుండి వినవచ్చును
5 వాల్వులు, 3 బ్యాండులు, అందమైన
వాల్‌నట్ కేబినెట్టు-
A. C., A C /D C డ్రై బ్యాటరీలలో
దొరుకును
ధర రు 180/-
ఆంధ్రకు సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
టెరిటోరియల్ ఏజెన్సీస్,
పి బి నెం 373, విజయవాడ-2
ప్రాతినిధ్యములేనిచోట్ల ప్రతినిధులు కావాలి

# అంతరార్థాలు

వస్తువుల నాణెం, ఖరీదు బాగా తెలుసునని చెప్పుకుంటూ వుంటుంది. నాకిదంతా ఇవాళ వాళ్ళ పాపసడగ్గా చెప్పింది కాని నేనీ నిజాన్ని తెలుసుకోకుండా మిమ్మల్ని నేక హైన మాటలని నొప్పించాను. నన్ను క్షమించండి!" అని అన్నది రాజ్యం.

వెంకట్రావు కిప్పుడంతా అర్థమైంది ఆమె అమాయకత్వానికి చాలా జాలికలిగింది. ఆమె అట్లా మాట్లాడ్డంలో గల అంతరార్థాన్ని గ్రహించకుండా ఆమెనిట్లా బాధించినందుకు చాలా పశ్చాత్తాపపడ్డాడు.

ఇంకా అలాగే ఏమీ జవాబు చెప్పకుండా నిల్చున్న భర్త కళ్లలోకి చూస్తూ "ఇంకా నాతో మాటాడరూ?" అనిజాలిగా ప్రశ్నించింది రాజ్యం.

వెంకట్రావింకా ఊరుకోలేక పోయాడు. "పిచ్చిపిల్లా ఈ పాటిదానికి అప్పుడే కన్నీళ్లేనా?" అని మృదువుగా పలికాడు

"మరి నేను వండుతే భోంచేయకుండా పోతున్నారూ!" అంది రాజ్యం గోముగా.

"పోనీ నిన్నను, ఇవాళ భోంచేయనిదంతా ఈ రాత్రి భోంచేస్తాన్లే!" అని అన్నాడు వెంకట్రావు నవ్వుతూ.

"అందుకే మీకోసం చాలా చేసివుంచాను!" అన్నది రాజ్యం ఆనందంతో

"అయితే వుండు మొహం కడుక్కొని వస్తాను!" అన్నాడు వెంకట్రావు

వెంకట్రావు మొహం, కాళ్ళు, చేతులూ కడుక్కొని వచ్చేసరికి రాజ్యం ప్లేటులో బజ్జీలు, కాఫీ పట్టుకునివచ్చి హాజరైంది. భర్త ఫలహారం చేస్తుంటే రాజ్యానికెంతో ఆనందం కలిగింది.

సాయంత్రం ఆరుగంటలకి "రాత్రికి కూర తీసుకురావాలండీ!" అన్నది రాజ్యం.

"ఏదీ, సంచీ ఇయ్యి!" అన్నాడు వెంకట్రావు.

"సంచీ ఇస్తానుకాని చాలా చవగ్గా కొని తేవాలి సుమండీ!" అంది రాజ్యంనవ్వుతూ.

"అలాగేనండి" అని నవ్వుతూ వెళ్ళాడు వెంకట్రావు బజారుకి.

వెంకట్రావు బజారు నుంచీ బంగాళా దుంపలు తెచ్చాడు

"ఎంతండీ రాజాగారూ ఈ కూర ధర?" అని అడిగింది రాజ్యం నవ్వుతూ.

"వీశ పదణాలు ఓహో! - మరిచాను. రాణీగారికి ధర చెప్పేటప్పుడు కొన్నధరకి నాలుగణాలు తగ్గించి చెప్పాలికదూ?... కాదుకాదు.. వీశ ఆరణాలండి!" అన్నాడు నవ్వుతూ వెంకట్రావు

"అయితే నేను కూడా మరో నాలుగణాలు తగ్గించి కామేశ్వరమ్మవచ్చి అడిగేటప్పుడు వీశ రెండాలే అని చెప్తాను!" అన్నది పకపకనవ్వుతూ రాజ్యం. ★

# ★ సంపదతెచ్చిన సంతాపం ★

(26-వ పేజీ తరువాయి)

సన్మానాలూ, సభలూ, ఊరేగింపులూ..."

రామానందం నవ్వాడు. డాక్టరూ బిగ్గరగా నవ్వాడు. అనూరాధా అనుసరించింది.

బంట్రోతుని హోటలుకెళ్ళి కాఫీ పట్రమన్నాడు డాక్టరు. ఇంతలో ఒకనర్సు పరుగెత్తుకు వచ్చింది "డాక్టర్! 'ట్వంటీ సిక్స్' బెడ్‌లో పేషెంటు నానా హంగామా చేస్తున్నాడు. యీ రోజే 'డిస్చార్జి' కావాలంటున్నాడు అలా 'డిస్చార్జి' చేయకపోతే మనల్ని తర్వాతైనా ఖూనీ చేస్తాడట. నాకు భయంగా వుంది డాక్టర్."

"ఎవరైనా కాపలావుంచి వచ్చావ్?"

"ఆ"

"సరే వస్తాను. నీవు వెళ్ళి అక్కడే వుండు"

"ఎవరు సుబ్బారావ్ ఆ పేషెంటు?" అని అడిగాడు రామానందం

"ఆ ఎవరో బైరాగి జీవితంలో అన్నీ పోగొట్టుకున్నాడిలా వున్నాడు. న్యూమోనియా జ్వరంలో వళ్ళు తెలియని పరిస్థితుల్లో యిక్కడికి ఎవరో తీసుకువచ్చారు జ్వరంలో ఏమేమో మాట్లాడేవాడు. చాలా విచిత్రమైన మనిషి వళ్ళు తెలిసినతర్వాత మందుత్రాగేందుకుఎంతోగొడవచేసేవాడు"

"ఇప్పుడెలావుంది డాక్టర్" అంది అనూరాధ ఆత్రంతో.

"జ్వరం తగ్గిపోయింది కొంచెం బలహీనంగా వున్నాడు. మూడు రోజుల్లో డిస్చార్జి చేస్తాము.

"ఎవరో వింత మనిషి లాగున్నాడే మేమూ చూడవచ్చా," అడిగింది అనూరాధ ఖాళీ కప్పు క్రింద పెడుతూ.

"ఆహా" అంటూ లేచాడు డాక్టరు. అందరూ లేచారు. ఇరవై ఆరో నెంబరు బెడ్ మీద పేషెంటు ఆరోజు పేపరుపెద్దగా చదువుతున్నాడు గడ్డం పెరిగుంది జుట్టు నూనెలేక ఎర్రగా ముఖంమీదికి పడుతున్నాది కళ్లు లోతుకుపోయి, ముఖం పాలిపోయి ఉంది. అతన్ని చూడగానే రామానందం, అనూరాధ ఏదో 'షాక్' తిన్నట్టు 'ఫీల' య్యారు.

"పేరేమిటి డాక్టర్ గారూ?" మెల్లిగా అడిగింది అనూరాధ.

"రామ్మూర్తి అనిజ్ఞాపకం" గొణిగాడు డాక్టర్.

"ఆ." అంటూ నేరుగా పరుగెత్తుకెళ్ళి పేషెంటు పాదాలు తాకింది.

"ఏమిటి డాక్టర్" అంటూ పేపరు తీశాడు పేషెంటు.

"బావా" అంటూ దగ్గరకెళ్ళాడు రామానందం.

"హు. ఈ జీవితంలో మిమ్మల్ని చూడకూడ దనుకున్నాను. కాని ఇప్పుడు చూడవలసి వచ్చింది. నీ చెల్లెలు మొగుడు ఆనాడు కోర్టులోనే చచ్చిపోయాడోయ్. అనూరాధా! ఆ పుస్తెలు తెంపెయ్-బొట్టు చెరిచేసి, గాజులు పగల కొట్టెయ్."

అనూరాధ బిగ్గరగా యేడ్చి కాళ్ళపై బడింది

"ఇప్పుడు నీ కే లోపమూ రాదు బావా. అనూరాధ పేరుతో కావలసినంత ఆస్తి ఉంది నీవూ వుంటే ఇద్దరంకలసి యింకా వృద్ధిచేసుకోవచ్చు చూడూ! చెల్లె యెంత చిక్కిపోయిందో" అన్నాడు రామానందం ప్రాధేయపడ్తూ.

"నాకేమీ అక్ఖర్లేదు మీరు వెళ్ళండి. నన్ను పోనీండి డాక్టర్"

"సరే. అనూరాధ ఆడదై పుట్టింది దానికి భర్తే సర్వస్వమూను మీరిద్దరూ యెక్కడైనా ఉండండి నెలనెలా మీకు కావలసిన పైకం పంపుతూంటాను."

"నీ మోచేతిక్రింద నీళ్లు త్రాగాల్సిన ఖర్మ నాకేంపట్టలేదు కష్టపడి సంపాయించి నా భార్యను పోషించుకొనే తాహతు నాకు లేకపోలేదు"

"సరే అవసరార్థం కొంతైనా యిస్తాను. దయచేసి తీసుకెళ్ళండి. ఒక్కక్షణం ఉండండి" అంటూ రామానందం డాక్టరు విశ్రాంతిరూములో ఉంచే తన పెట్టెవద్దకు పరుగెత్తాడు.

"అనూ మీ అన్నయ్యవద్దనుంచి ఒక్క కానీ తెస్తే నీకూ నాకూ సంబంధం తెగిపోయిందన్నమాటే నేను కావాలంటే యెలా ఉన్నదానివి అలానే బయలుదేరు"

"సరే" అంది అనూరాధ.

రామ్మూర్తి అనూరాధ చెయ్యిబట్టి లాక్కెళ్ళుతున్నాడు. డాక్టరు అడ్డు చెప్పలేకపోయాడు. రామానందం నోట్లకట్టలతో పరుగెత్తాడు వాళ్ళవనకాలే పరుగెత్తోయాడు కాని డాక్టరు అతన్ని నిలిపేశాడు. హాస్పిటలు ఆవరణ దాటారు. పోస్టుమార్టెం రూముగూడా దాటి ఇంకా వెళ్తున్నారు.

చీకటి ఫులుముకొంటూంది. మేఘాలు గాఢంగా ఆవరించుకొంటున్నాయి చిన్న చినుకులు పడుతున్నాయి. పెనుగాలి వీస్తూంది. చెట్లనుంచి ఎండిన ఆకులు గలగల రాల్తున్నయ్ దూరాన రైలుకూత వినిపించింది. రామానందం చేతిలో నోట్లకట్టలతో అలాగే నిలబడి ఉన్నాడు అలా ఎంతసేపు నిలబడ్డాడో.... డాక్టరు డ్యూటీ పూర్తి చేసుకుని వచ్చేటప్పటికి రామానందం గొణుగుతున్నాడు "పజిలూ-రామ్మూర్తీ" అని. ★